


# 'గమ్యం'

చీకటిని చీల్చుకుంటూ వెలుగు రేఖలా పరుగెత్తుతోంది రైలు, గమ్యం కోసం.

సబ్బుల కంపెనీ అడ్వర్‌టైజ్ మెంటులా తెల్లటి బట్టలు వేసుకున్న టిక్కెట్ కలెక్టర్ రాకతో కంపార్టుమెంటులో సంచలనం చెలరేగింది.

అందరూ టిక్కెట్లు చూపించారు ఒక్క ముసలాయన తప్ప.

ముసలాయన అంతా వెతుకులాడుతూ "నా సంచీ... నా సంచీ...." అన్నాడు ఆందోళనతో.

"ఏమైంది?"

"ఏమో బాబూ!... నా సంచీ కన్పించడంలేదు. అందులోనే టిక్కెట్టు వుంది. తొమ్మిది రూపాయలున్నాయి. జత బట్టలు. అరటి పళ్ళు"

ఆ సంచీలో వున్న జాబితా చదువుతూ వుంటే కొందరు కుర్రాళ్లు వేళాకోళం చేశారు.

"ముసలాడు భలే ఎత్తు వేశాడు. వాడికొక సంచీ వుందంటావా?"

అసలు టిక్కెట్టు కొనివుంటే జేబులో పెట్టుకుని వుండేవాడు గాని సంచీలో వుంచుతాడా? ఏవిటో మాయ మాటలు."

అని కొందరు ఆ ముసలాయన్ని మోసగాడుగా అభివర్ణిస్తున్నారు.

"పాపం నిజంగానే సంచీ పారేసు కున్నాడేమో! అందులోనే అతని సర్వస్వం వుందేమో?"

"ఆ దొంగకి ఈ ముసలాయన సంచీయే దొరికిందా? కలికాలం కాకపోతే! పాపం ఎట్లా అల్లాడి పోతున్నాడో!"

అని మరి కొందరు సానుభూతి చూపిస్తున్నారు.

అతనికి అరవై ఏళ్ళ పైనే వుండొచ్చు. తెల్లటి గడ్డం, మీసాలు చూస్తుంటే ఎవరో గొప్ప మేధావిలా కనిపిస్తున్నాడు. అనుభవాలతో పండినట్లు అతని ముఖం ముడతలు పడింది.

ఆయన్ని చూస్తుంటే దొంగ అని పించక పోయినా, గౌరవభావం కలిగిస్తున్నా, వుద్యోగ నిర్వహణకి బద్ధుడై వచ్చే స్టేషన్లో దించి వేయాలని నిర్ణయించుకున్నాడు టిక్కెట్ కలెక్టర్.

"తాతగారూ! మీరు టిక్కెట్ కొని వుండొచ్చు. కాని చూపించ లేకపోయారు. అందుకే వచ్చే స్టేషన్లో దించి వెయ్యాక తప్పదు." అన్నాడు.

ఆయన నవ్వాడు నవ్వుతున్న పెదవుల వెనుక ఎంతో బాధ వ్యక్తమౌతూ వుంది.

"బాబూ! తప్పు నాదే. దరిద్రుడి సంచి గూడా దొంగిలించే రోజులొచ్చాయని గ్రహించక పోవడం తప్పే." అని అతని ముఖంలోకి " సూటిగా చూసి "నీ పేరేమిటి బాబూ!" అన్నాడు.

"శేఖర్."

"చూడు శేఖర్! నేను దొంగను కాను. నన్ను వచ్చే స్టేషన్‌లో దించి వేసి అవమానించకు. నేను తెనాలి వెళ్ళాలి టిక్కెట్ ఇవ్వు. నా దగ్గర డబ్బులేదు. ఈ జేబు గడియారం నీ దగ్గరుంచు. డబ్బు ఇచ్చి తీసుకెళ్తాను." అన్నాడాయన జేబు గడియారం తీసి.

శేఖర్ మనస్సు చివుక్కు మంది. హృదయం స్పందించింది ఆయన మాటలకు. ఎంతో అభిమానం వున్న మనిషి అనిపించింది.

ప్రయాణీకులంతా వింతగా చూస్తున్నారు ఏం జరుగుతుందోనని.

టిక్కెట్టు రాసిచ్చి ఆయన చేతిలో వుంచి "తాతగారూ! మీ గడియారం మీ దగ్గరనే వుంచండి. వెసులు బాటు కలిగినప్పుడే డబ్బు పంపండి. ఇదుగో నా అడ్రస్." అని చీటీ గూడా అందించాడు శేఖర్.

అందరూ శేఖర మంచితనాన్ని మెచ్చుకున్నారు.

ఇంతలో గూడూరు వచ్చింది. అక్కడ చాలా సేపు బండి ఆగుతుంది. ఇంజన్ నీళ్ళు పోసుకుంటుంది. అందుకే కాఫీ ఫలహారాలకు చాలా మంది దిగిపోయారు.

గంట దాటిపోయినా బండికిసిగ్నల్ ఇవ్వలేదు.

ముసలాయన బండిలోనే కూర్చుని కునికి పాట్లు పడుతున్నాడు.

"తాతగారూ!... తాతగారూ!... అన్న పిలుపు విని వులిక్కిపడి లేచాడు.

"సారి తాతగారూ! మీ పేరు నాకు గుర్తురాలేదు... వెంకట్రామయ్యగారు గదూ!..." అన్నాడు శేఖర్.

ఆయన నవ్వుతూ "తాతకు పేరెందుకయ్యా!.... తాతనే పిలువు అన్నాడు.

"అలాగే తాతగారూ!"

"ఏమిటి బాబూ! నా అడ్రస్ ఏమైనా ఇవ్వమంటావా?" అన్నాడు.

శేఖర్ నవ్వి "అబ్బే! అందుకు కాదులెండి మీది మరీ సున్నితమైన మనసు, మీరేదో ఉద్యోగం చేసి రిటైరైనట్లుగా అనిపిస్తుంది నాకు. స్కూల్ మాష్టారుగా పని చేశారా ఏమిటి?" అన్నాడు.

"కాదు బాబూ! నేనూ నీ లాగే టికెట్ కలెక్టర్ని" నవ్వుతూ అన్నాడు వెంకట్రామయ్య.

శేఖర్ అదిరిపడ్డాడు.

"మీరు టిక్కెట్ కలెక్టరుగా పనిచేశారా?... మరి ఇంతవరకూ ఎందుకు చెప్పలేదు. "స్టాఫ్" అని ఒక్క ముక్క నాతో అంటే సరిపోయేదిగదా?" నొచ్చుకున్నాడు శేఖర్.

"ఫరవాలేదు... లే"

"అసలు విషయం చెప్పడానికి వచ్చి ఏమేమో చెప్తున్నాను. ఇంతకి సంగతేమిటంటే ఈ రైలు బహుశా ఇప్పట్లో కదలదు కోస్తా జిల్లాలలో భయంకరమైన తుఫాన్ చెలరేదుటూ ఉందట రైళ్ళన్నీ రద్దయిపోయాయి."

"తుఫానా? ఎక్కడ బాబూ, తెనాల్లో గూడా వుంటుందా?" ఆదుర్దాగా అడిగాడు.

"ఒక్క వూరని ఏమిటి? కోస్తా జిల్లాలకి అని తెలిసింది. ఈ తుఫాన్ తాకిడికి ఎంతపంట నష్టం జరుగుతుందో? ఎందరి ప్రాణాలు పోతాయో? ఎన్ని ఇళ్లు నేలమట్టమైపోతాయో? ఎవరికి తెలుసు?" అన్నాడు శేఖర్ విచారంగా.

"ప్రతియేడూ ఇట్లాగే ముంచుకొస్తున్నది. ఈ తుఫాన్లు ఎందుకొస్తున్నాయో అర్థం కావడం లేదు."

"లేవండి తాతగారూ!"

"ఎక్కడికి?" ఆశ్చర్యబోతూ అన్నాడు వెంకట్రామయ్య.

"దగ్గర్లోనే నా క్వార్టర్ వుంది. మళ్ళీ రైళ్ళు కదలే వరకూ ఎక్కడ వుంటారు మీరు, చేతిలో పైసాలేకుండా; అసలే మీరు మొగమాటస్తులు."

"ఎందుకు బాబూ నీకు శ్రమ?" అన్నాడు.

"అలా అనుకోకండి. చేతిలో పైసా లేకుండా ఎక్కడ వుంటారు మీరు?" రెట్టిస్తూ అన్నాడు.

ఆ ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోయాడు.

"అవును డబ్బులేకపోతే గడువదు మనిషికి" అనుకున్నాడు.

మారు మాట్లాడకుండా లేచి శేఖర్ని అనుసరించాడు వెంకట్రామయ్య.

క్వార్టర్ దగ్గరలోనే వుంది.

పనిమనిషి నీళ్ళుతోడి కారియర్ తెచ్చింది.

భోజనం చేశాక అరటిపండు చేతికిస్తూ "తాతగారూ! ఇప్పుడు చెప్పండి. మీరు ఏ సంవత్సరంలో రిటైరయ్యారు.

"నేను రిటైరవ్వలేదుబాబూ! లంచం తీసుకున్నందుకు డిస్మిస్ చేశారు."

దెబ్బతిన్నవాడిలా చూశాడు శేఖర్.

"మీరు లంచం తీసుకునే మనిషిలా లేరు నాకు నమ్మబుద్ధి పుట్టడంలేదు. లంచగొండికి వుండవలసిన చొరవ, నేర్పు మీ దగ్గర లేనే లేవు." అన్నాడు.

"నిజమే! కాని అవసరాలు నన్నలా దిగజార్చాయి. అదంతా ఒక కథ!" అంటూ చెప్పసాగాడు.

"ఆ రోజు నాకు బాగా జ్ఞాపకం. ముసురుపట్టి వుంది. బహుశా అక్టోబర్ నవంబర నెలలో ఒకరోజు –

బెజవాడ ప్యాసింజరు బండి చెక్ చేస్తున్నాను. ఒక కంపార్టుమెంటులో నలుగురు టికెట్ లేనివాళ్ళు దొరికారు. అందులో ఒక ఆడపిల్లగూడా వుంది. తనను వదిలేయమని కాళ్ళా వెళ్లా బ్రతిమాలింది, నేను స్వతహాగా సున్నిత మనస్కుడినే అయినా తెల్లకోటు వేసుకోగానే యమధర్మ రాజులా ప్రవర్తించేవాడిని. ఆ పిల్ల మొరాలకించలేదు నేను ప్రక్క స్టేషన్ రామాపురం రోడ్డులో ఆ నలుగుర్నీ దించివేశాను. తర్వాత ఏం జరిగిందో తెలుసా?"

శేఖర్ కుతూహలంగా ముందుకు వంగి "ఏం జరిగింది?" అన్నాడు.

"నా జీవితంలో పెద్ద మార్పు తెచ్చిన సంఘటన జరిగింది. ఒక వారం తర్వాత నా కొడుకు సత్యం ఆ అమ్మాయినే పెళ్ళిచేసుకుని యింటికి తీసుకొచ్చాడు."

"ఆ అమ్మాయి మీ అబ్బాయికి ఎక్కడ తటస్థపడింది?"

"అదీ చెప్తున్నా! ఆ రోజు నేను ఆమెను దించివేసిన స్టేషన్‌కి నా కొడుకు స్టేషన్ మాస్టర్, ఆ ముసురులో రాత్రి పూట ఆ చిన్న స్టేషన్లో ఉండటానికి అమ్మాయికి భయం వేసిందట. మా సత్యం తన క్వార్టర్స్‌కి తీసుకెళ్ళాడట ఆ అమ్మాయిని. ఆ అమ్మాయి పేరు సుశీల.

ఆ పిల్లకి సవతిపోరు, వయస్సు మళ్ళినవాడికి పెళ్ళి చెయ్యటానికి ప్రయత్నిస్తుంటే పారిపోయివచ్చిందట. ఆమె కథవిని మా సత్యం జాలిపడ్డాడు. ఆ పిల్ల అందంగా కూడా ఉందిలే. ఇంకేం. ఒంటరిగా వున్నారు తొందరపడి వుంటారు. ఎవరో ముక్కు మొఖం తెలియని పిల్లని పెళ్లి చేసుకోవడానికి నేను ఒప్పుకోనని, గుళ్ళో పెళ్ళి చేసుకుని ఇంటికి తీసుకొచ్చాడు. అబ్బ! ఆ రోజు ఇంట్లో పెద్ద గొడవజరిగింది. సత్యం వాళ్ళమ్మ ఏడుపులూ, పెడబొబ్బలూను, నేనూ కోపంగా నాలుగు తిట్టాననుకో."

"మీ అబ్బాయి మంచివాడిలా వున్నాడండీ. ఆడపిల్లని మోసం చెయ్యకుండా పెళ్ళిచేసుకున్నాడంటేనే తెలుస్తోంది ఎంత మంచివాడో?" అన్నాడు శేఖర్.

"నాకూ తెలుసు ఆ సంగతి జరిగిందేదో జరిగిపోయిందని ఎవరమూ అనుకోలేదు. ఎందుకంటే వాడి జీవితం చుట్టూ మా జీవితాలు అల్లుకొనివున్నాయి వాడిమీద కొండంత ఆశ పెట్టుకుని వున్నాం. మా వాడికి పదివేలు కట్నం ఇస్తామని ఆడపిల్లల తల్లితండ్రులు ఇంటిచుట్టూ తిరుగుతున్నారు. వాడిపెళ్లి చేసి ఆ కట్నం డబ్బుతో మా అమ్మాయి కమల పెళ్ళి చెయ్యాలని అనుకుంటున్నాం. మా ఆశకాస్త నిరాశచేశాడు సత్యం.

ఆ రోజు కోపంతో వాడిని ఇంటినుంచి వెళ్ళగొట్టారు. ఈ జన్మలోనాకు ముఖం చూపించవద్దని కఠినంగా మాట్లాడాను. తండ్రీ కొడుకుల బంధాన్ని త్రెంచుకున్నాను. అర్థంలేని పట్టుదలతో విడిపోయాం. మళ్ళీ ఇంతవరకూ కలుసుకోలేదు. ముసలాయన కళ్ళు తుడుచు కున్నాడు కన్నీరు ఆపుకుంటూ.

'కొడుకు మోసంచేశాడని నా భార్య రోజూ బాధపడేది. కని పెంచి చదివించి ఎన్నో ఆశలు పెట్టుకున్నవాళ్ళని కాదని చెప్పా పెట్టకుండా పెళ్ళిచేసుకున్నాడని అందరితోనూ చెప్పుకుని ఏడుస్తూ వుండేది. రోజులు భారంగా గడుస్తూ వుంటే కమలపెళ్ళి మా కొక పెద్ద సమస్యగా కూర్చుంది.

సత్యాన్ని చదివించడానికే అప్పులు చెయ్యాల్సివచ్చింది. ఆ అప్పులే ఇంకా తీరలేదు. ఆ పరిస్థితుల్లో వేలకి వేలు అప్పు ఎవరిస్తారు? ఇచ్చిన అప్పు తీర్చే మార్గం ఏది?

ఇన్నాళ్ళూ సత్యం నెలనెలా పంపుతున్న డబ్బుతో అప్పు తీరుస్తున్నాం. ఇక ఆ ఆశ లేదు గదా.

ఎలాగైనా డబ్బు సంపాదించాలని పిచ్చిపట్టుదలతో అడ్డదారులు తొక్కాను. విచ్చలవిడిగా లంచాలు తీసుకునేవాడిని రోజులన్నీ మనవికానట్టు ఒకసారి అధికారులు పట్టుకున్నారు. నేరాలు రుజువైనాయి. వుద్యోగం పోయింది."

"ఆ తరువాత అన్నీ కష్టాలే. పాతికేళ్ళు నిండి నా కూతురు పెళ్ళి చెయ్యలేక పోయాను తనని పెళ్ళిచేసుకుంటానని నమ్మించిన ఒక దుర్మార్గుని నమ్మి తన జీవితం నాశనం చేసుకుంది కమల. కమల గర్భవతి అని తెలిసిన తర్వాత ఆ కసాయివాడు చెప్పా చెయ్యకుండా వెళ్ళిపోయాడు. అవమానంతో ప్రాణం తీసుకుంటానికి సిద్ధపడింది కమల. కాని మేమే దాన్ని ఓదార్చి ధైర్యం చెప్పాము ఏ అఘాయిత్యం చేస్తుందోనని అహర్నిశలు కాపలాకాసేవాళ్ళం. పెళ్ళికాకుండా తల్లి అయినందుకు లోకులు కాకుల్లా పొడుస్తుంటే ఎంతో సహనం వహించింది. సూటి పోటు మాటలతో బంధువులే అవమానిస్తుంటే భరించి కాలంగడిపాం. దిగులుతోనే దాని ఆరోగ్యం పాడైపోయింది ప్రసవించి ఈ లోకాన్ని వదిలిపోయింది బాబూ."

వెంకట్రామయ్య దుఃఖంతో బాధపడుతూవుంటే శేఖర్ మౌనంగా వుండిపోయాడు.

"జరిగిందేదో జరిగిపోయింది గదా! మీరు ఇప్పటికైనా కొడుకు దగ్గరకు వెళ్ళివుండవచ్చును గదా!"

"ఆఁ.... .... వుండొచ్చు ఇప్పటి వరకూ ఆరోగ్యంగానే వున్నాను. స్వతంత్రంగా బ్రతుకుతున్నాను కాలూ చెయ్యీ పోయాక చూద్దాం..." అని పొడిగా నవ్వి "నా కొడుకు నీకు తెలుసా? మీ డిపార్టు మెంటే గదా?" అన్నాడు.

"యన్ సత్యనారాయణగారేగదా!"

"ఆఁ వాడే"

"తెలియకపోవడం ఏమిటి తెలుసు"

"ఇలా నేను కన్పించినట్టు చెప్పకు వాడికి నేనెక్కడుందీ తెలియదు."

"భలే వారే! తాతగారూ! మీ గురించి ఎందుకు చెప్తాను. అసలాయన్ని పలకరిచాలంటేనే భయంగా వుంటుంది. కోపిష్ఠి మనిషి." అన్నాడు శేఖర్.

"అవును.... అంతేవాడు."

"ఇక రెస్ట్ తీసుకోండి తాతగారూ! పొద్దుపోయింది." అన్నాడు శేఖర్ ఆవులిస్తూ.

★ ★ ★

"గుడ్ మార్నింగ్ తాతగారూ!"

"గుడ్ మార్నింగ్ శేఖర్ నేను నిద్ర లేవక ముందే ఎక్కడికి వెళ్ళావయ్యా?" అన్నాడు వెంకట్రామయ్య.

"వూళ్ళోకి వెళ్ళి వస్తున్నాను. రాత్రి తుఫాన్‌కి కోస్తా జిల్లాలలో చాలా ఘోరం జరిగిపోయిందని తెలిసింది. రైలు పట్టాలు కొట్టుకు పోయాయట. రైలు స్టేషన్లు గూడా కూలి పోయాయట. కొన్ని వూళ్ళకి వూళ్ళే వుప్పెనలో పూర్తిగా మునిగి పోయాయట. పంటలు సర్వ నాశనం. గుంటూరు, బెజవాడ, బందరు తెనాలి వగైరా పట్టణాలు బాగా దెబ్బతిన్నాయట. ఇళ్ళు కూలిపోయి, చెట్లు విరిగిపోయాయట. అన్నిటి కంటే ఘోరం కొన్ని వేలమంది ప్రాణాలు కోల్పోయారట. అవన్నీ వింటూ వుంటే ఏడుపు వస్తూ వుంది. ఇంకా సరైన సమాచారం తెలిస్తే ఎన్ని ఘోరాలు బయట పడతామో!"

వెంకట్రామయ్య చేష్టలు దక్కివింటూ వుండిపోయాడు.

"తాతగారూ!... తాతగారూ?"

"నేను అర్జంటుగా వెళ్ళిపోవాలి బాబూ! నేను తెనాలి వెళ్ళే మార్గం ఏదైనా వుందా?"

"కలెక్టరుగారు బస్సుల్లో ప్రయాణీకుల్ని పంపే ఏర్పాటు చేస్తున్నారని తెలిసింది. తొందరపడకండి ముందు టిఫిన్ తీసుకోండి. వెళ్దాం." అన్నాడు శేఖర్.

ఇద్దరూ కలిసి వూళ్ళోకి వెళ్ళారు, బెజవాడ వరకూ బస్సు బయల్దేరింది.

"వుంటాను తాతగారూ! తెనాలి వచ్చినప్పుడు మీ ఇంటికి వస్తాలెండి." అన్నాడు శేఖర్.

"తప్పకుండా రా బాబూ!" అన్నాడు వెంకట్రామయ్య.

★ ★ ★

"అమ్మా!... అమ్మా!... అంటూ తలుపు కొట్టాడు శేఖర్.

"వచ్చాడు చూడు నీ ముద్దుల కొడుకు" అన్నాడు శేఖర్ తండ్రి.

"అబ్బా మీరు వాడిని ఏమీ అనకండి" తల్లి వారిస్తోంది.

"నేనేమంటాను, మీ ఇష్టం వచ్చినట్లు వూరేగండి" విసుక్కుంటున్నాడు తండ్రి.

ఆమె తలుపు తీసింది.

శేఖర్ని చూస్తూనే తండ్రి ఎగిరిపడ్డాడు.

"ఈ రోజు పెళ్ళి చూపులని తెలిసి గూడా రాకుండా ఏం చేస్తున్నావు?"

'చెప్పానుగా!" అన్నాడు శేఖర్.

"ఏమని?"

"రానని"

"అంటే."

"ఎన్నిసార్లు చెప్పాలి నాకు ఇష్టం లేదని"

"అంటే నీ వుద్దేశ్యం ఏమిటి?"

"నన్ను ఇంట్లోకి రానిస్తారా లేదా? విసుగ్గా అన్నాడు.

"మీరు కాసేపు వూరుకోండి" అంది తల్లి భర్తవైపు కోపంగా చూసి.

శేఖర్ సూట్‌కేస్ పట్టుకొని లోపలకు వచ్చాడు.

అతని వెనుకనే నీడలా వచ్చిన అమ్మాయిని చూసి శేఖర్ తల్లితండ్రులు ఆశ్చర్యపోయారు.

"రా అరుణా!" అన్నాడు శేఖర్.

ఆమె నెమ్మదిగా అడుగులు వేసింది.

"మా అమ్మ! నాన్న..." తల్లిదండ్రుల్ని పరిచయం చేశాడు.

"నమస్కారమండీ," చేతులు జోడించింది అరుణ.

"పెళ్ళి చేసుకుని వచ్చావన్నమాట కోపంగా అన్నాడు తండ్రి.

"నేనంత పిరికివాడిని కాదు" శేఖర్ కోపంగా అన్నాడు.

"ఏవర్రా ఈ అమ్మాయి?" అంది తల్లి విభ్రాంతి నుంచి తేరుకుని.

"అదంతా పెద్ద కథలే అమ్మా! ప్రస్తుతం ఈ అమ్మాయికి ఒక్క తాత తప్ప ఎవరూ లేరు. ఒకప్పుడు బాగా బ్రతికిన వారే, కాని ఇప్పుడు చితికి పోయారు.

"అసలింతకీ నువ్వు చెప్పేదేమిట్రా ఈ దిక్కులేని పిల్లని ఇంటికి తీసుకురావడంలో నీ వుదేశ్యం ఏమిటి?" తండ్రి కోపాన్ని దిగమ్రింగుకుంటూ అన్నాడు.

"సదుద్ధేశమే"

"అంటే"

"ఈ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాను"

"ఈ దిక్కులేని దాన్నా! అవతల బోలెడుకట్నం ఇస్తామని తిరుగుతుంటే"

"దిక్కులేనిది అంటారేమిటి ఈ అమ్మాయికి తాత వున్నాడు" గట్టిగా అన్నాడు శేఖర్.

"ఏడి? ఎక్కడ?"

"వరండాలో కూర్చున్నాడు పిల్చుకుని రండి"

"ఆc... మీరెళ్ళి పిలిస్తేగాని ఆయన రారు. చాలా అభిమానంగల మనిషి" అన్నాడు శేఖర్.

భార్య భర్తలు ఇద్దరూ కలిసి వరండాలోకి వెళ్ళారు.

వెంకట్రామయ్య పడక కుర్చీలో కూర్చుని వున్నాడు. ఆయన్ని చూసి బిత్తరపోయాడు శేఖర్ తండ్రి. అతని తల్లి ఆశ్చర్యంతో చిత్తరువులా నిలబడి పోయింది.

"నాన్నా!..." అన్నాడు సత్యం.

"మామగారూ!.... ఆనందంగా అంది సుశీల.

సుశీల మామగారికి కాళ్ళకి నమస్కారం చేసింది.

వెంకట్రామయ్య కళ్ళు ఆనందంలో చెమర్చాయి.

"నీ కొడుకు అసాధ్యుడురా! నాకు మాయ మాటలు చెప్పి తీసుకొచ్చాడు. ఇది మీ ఇల్లని నాకు తెలియదు."

"ఇప్పుడు తెలిసిందిగా! ఇక మీ పట్టుదల వదలిపెట్టి ఇక్కడే వుండాలి తాతా! అన్నాడు శేఖర్ నవ్వుతూ.

ఇంకెక్కడికి పోతాను నేను..." ఆనందంగా అన్నాడు వెంకట్రామయ్య.

"మా తాత మంచివాడు". అన్నాడు శేఖర్.

"నేను కాదు, నువ్వే మంచివాడివి" అన్నాడు వెంకట్రామయ్య.

"మీ రిద్దరూ కాదు మామగారు మంచివాడు" అంది అరుణ నవ్వుతూ.

"అంతా మంచివాళ్ళే" అంటూ నవ్వుకుంది సుశీల.

"మంచివాళ్ళకేనమ్మా కష్టాలూ" అన్నాడు వెంకట్రామయ్య

"కష్టాలకూ గమ్యం వుంటుంది మామగారూ!"అంది కోడలు,

"నిజమే" అన్నాడు వెంకట్రామయ్య.

*–జయశ్రీ మాసపత్రిక, డిసెంబర్, 1980*